# అలలు సద్దుమణిగిన సముద్రం

"నా గురించి ఎవరైనా వచ్చారా?" ఇంటిలోనికి అడుగుపెడుతూనే అడిగాడు మూర్తి.

"ఎవరొస్తారండీ" ఆమె గొంతులో చిరాకు ధ్వనించింది. ఆఫీసునుండి రాగానే రోజూ యిదే ప్రశ్న" విసుగ్గా గొణుగుతూ విసురుగా వెళ్ళిపోయింది అతని భార్యకమల.

కుర్చీలో కూలబడ్డాడు మూర్తి. అతడు చాలా ఆందోళనగా వున్నాడు.

వానవస్తుందేమోనని భ్రమపడి వానకొరకు ఎదురుచూసి విసిగిపోయిన వైశాఖం వేడి గాల్పుతో నిట్టూరుస్తోంది.

"టీ తీసుకోండి" టీ తీసుకొచ్చింది కమల

"అయితే అతను ఈ రోజు కూడా రాలేదన్నమాట" టీ తీసుకుంటూ" బరువుగా అన్నాడు అతడు.

"ఎవరండీ అతడు?" కమల గొంతులో కోపం ధ్వనించింది. "అసలు అతను ఎవరు ? గత ఐదేళ్ళుగా రోజూ ఇదే ప్రశ్న. ఎవరండీ అతడు ? ఎలా వుంటాడు ?"

అవును, అతడు ఎలా ఉంటాడు ?

టీ చప్పరిస్తూ గోడమీదకు దృష్టి మళ్ళించాడు మూర్తి. గోడమీద గీతలే తప్ప ఆకారాలు లేని ఆధునిక ఛాయాచిత్రాలని చూస్తూ ఆలోచించాడు.

అతడు ఎలా వుంటాడు ?

అతడు ఎలా వుంటాడని అమ్మ ఎప్పుడూ చెప్పలేదు. కానీ కష్టం వచ్చినప్పుడల్లా చెప్తూవుండేది. "బాధపడకురా మూర్తీ, ఈ కష్టాలు, బాధలు ఎన్నాళ్ళు కనుక, ఆయన కనబడినంతవరకే కదా?"

చిన్నప్పుడు పండుగకు కొత్త చొక్కిలేదని ఏడ్చినప్పుడు ఆ మాటలే అంది అమ్మ. పెద్దవాడివయ్యాక మంచి మార్కులు తెచ్చుకున్నా పై చదవులు చదువలేక పోతున్నాడని బాధపడిఏడ్చినప్పుడు కూడా ఆ మాటలే అంది. అర్హతలేనివారు కూడా ఉద్యోగాలు సంపాదించుకుంటూ వుంటే , తన అర్హతకి అనువైన ఉద్యోగం దొరకలేదని

బాధపడుతున్నప్పుడు కూడా అవేమాటలు పలుకుతూ వుంటే పట్టరాని కోపం వచ్చేది మూర్తికి.

"ప్రతీసారీ యివే మాటలు అంటావు. ఎవరమ్మా అతను? ఎలా వుంటాడు. మనకు ఏమవుతాడు ?"

కొన్ని నిముషాలు అమ్మ అలా ఉండిపోయింది. ఆ తరువాత మెల్లగా అంది. "ఏమిటి చెప్పనురా... నిన్ను నియంత్రించే వాడురా అతడు. నీలాగే వుంటాడు అనుకో. మరోమాటలో చెప్పాలంటే నీ తండ్రే అనుకో నాయనా" గట్టిగా నిట్టూర్చింది ఆవిడ.

తండ్రి మొహము చూడని మూర్తి అతని కోసం వెతుకుతూనే వున్నాడు గత ముప్పది సంవత్సరాలుగా.

ఏదో ఒకరోజు అతడు కనబడతాడని, తన కష్టాలన్నిటినీ గట్టెక్కిస్తాడనీ మూర్తి ఆశ.

"టీ చల్లారిపోయిందండీ" గోడకేసి తదేకంగా చూస్తూ కూర్చున్న మూర్తితో అంది కమల. "మీరెందుకో చాలా ఆందోళనగా ఉన్నారు"

భర్తమొహం చూస్తూ వుంటే గుండెల్లో దడ పుట్టుకొచ్చింది ఆమెకి. చాలా నీరసంగా ఉన్నాడతడు. నలభై సంవత్సరాలు నిండకపోయినా అరువది ఏళ్ళవాడిలా కనబడుతున్నాడు మూర్తి. ఎప్పటికి కనబడని "అతని" గూర్చిన ఆలోచనవల్ల కాబోలు జుట్టు పూర్తిగా నెరసిపోయింది. ఎర్రగా ఉన్న అతని కళ్ళు చూస్తూ ఉంటే పశ్చిమాన అస్తమించేది ఒక సూర్యుడు కాదు, యిద్దరు సూర్యులేమోననేభ్రమ కలిగింది ఆమెకు.

"ఏమైందండీ మీకు?" కమల అడిగింది.

"అప్పలరాజుకి ప్రమోషన్ యిచ్చేసారే" మెల్లగా గొణిగాడు మూర్తి.

కమల గుండెల్లో రాయి పడింది. అయితే ఈయన ఓ వారం రోజులు యింతే అనుకొని, నిట్టూర్చింది. అప్పలరాజు అందరికన్నా జూనియర్ అతనికి ప్రమోషన్ ఇవ్వటము ఏమిటి....! అయినా ప్రయివేటు రంగ సంస్థలలో జరగరానిది ఏముంది!

రోడ్డు వేపు దృష్టి మళ్ళించింది ఆమె.

ఎదురుగా అల్లకల్లోలముగా ఉంది సముద్రము ఆకాశాని కెగసిన చందమామని

అందుకోవాలని ఆరాటపడి ఎగిరిఎగిరి పడే కెరటాలు నడుము విరిగి సముద్రములో పడుతున్నాయి.

"కాస్సేపు పడుకోండి" అతని ఒంటిమీద చెయ్యివేసి చూసి అంది ఆమె. "ఒళ్ళు వెచ్చగా వుండండీ జ్వరం వచ్చినట్లుంది"

"పడుకొంటే ఎలాగే" ఆ మాటలు అగాధమైన బావి నుంచి వచ్చినట్లు తోచింది ఆమెకు. "బాస్ గృహప్రవేశము కదా, డిన్నరుకి వెళ్ళాలికదా"

నిజమే! ఒంట్లో బావున్నా లేకపోయినా వెళ్ళటం తప్పదు. సగటు ఉద్యోగికి బాసే కదా కనబడే దేవుడు! మెల్లగా లేచి లోపలికి నడిచాడు మూర్తి.

తప్పదని వెళ్ళాడు గానీ ఉత్సాహంగా లేడు మూర్తి. బాస్ యింట్లో యిటూ అటూ తిరిగాడు అతని సహోద్యోగులెవరూ కనబడలేదు. బాస్ అసలే కనబడలేదు.

"అలా ఒంటరిగా నిలబడ్డావేమిటిరా?" బాస్ యింటి ఎదురుగా వున్న పార్కుని చూస్తూ నించున్న మూర్తి ఉలిక్కిపడ్డాడు. దగ్గరగా నిలబడి వున్నాడు అతని సహోద్యోగి ఒకడు.

"అలా అయిపోయావేమిటి" అతను మళ్ళీ అడిగాడు. "ఆరు నెలలు జబ్బుపడి లేచినవాడిలా కనబడుతున్నావు"

మూర్తికి ఏమీ మాట్లాడాలని అనిపించలేదు. అప్పలరాజుకి యిచ్చిన ప్రమోషన్ అతని మెదడుని తొలచివేస్తోంది.

వైశాఖమాసపు ఎండకి ఎండిపోయిన పార్కు జీవకళ కోల్పోయి వికారంగా కనిపించింది మూర్తికి. ఎప్పుడు వస్తాడో తెలియని అనామకుని కొరకు ఎదురుచూసే తనలాగే జీవకళని తెచ్చే తొలకరి చినుకు కొరకు ఎదురు చూస్తోంది పార్కు.

మెల్లమెల్లగా సహోద్యోగులు ఒక్కక్కరు చేరారు. ఇంక్రిమెంట్లు గురించి, ప్రమోషన్లగురించి ఏవేవో మాట్లాడుకుంటున్నారు. మూర్తికి అవేమీ వినాలని అనిపంచలేదు. మాట్లాడాలని అస్సలే అనిపించలేదు.

"అప్పలరాజు వచ్చేస్తున్నాడురా" హఠాత్తుగా ఉద్యోగుల్లో సంచలనం చెలరేగింది. కొంతదూరములో వున్న అయస్కాంతం వైపు అతుక్కుపోయే యినుము ముక్కల్లా

అతని చుట్టూ చేరిపోయారు వారు.

"ఇప్పుడేమిటిరా రావటం?" ఒకడు అప్పలరాజుని అడిగాడు. అప్పలరాజు ఏమీ మాట్లాడలేదు. కృష్ణ పరమాత్ముడులా చిద్విలాసంగా నవ్వాడు.

"ఒరేయ్ పిచ్చివాడా, వాడు మూడు రోజుల నుంచీ ఇక్కడే వుంటున్నాడు కదరా?" మరొకడు అన్నాడు.

అంతవరకూ ఎవరికీ కనబడని బాస్ పరుగెత్తుకొని వచ్చాడు అక్కడికి. "వచ్చేసావా అప్పలరాజూ!" హాయిగా గాలి పీలుస్తూ అన్నాడు అతడు. "టైం అయిపోతోంది ఇంకా నువ్వు రాలేదనీ కంగారుపడుతున్నాను"

"కంగారెందుకండీ? నేను టయిముకి వుంటాను కదా?" అప్పలరాజు అన్నాడు. "అన్నీ రెడీయే కదా?"

"ఐస్‌క్రీమ్ రాలేదు అప్పలరాజు" కంగారుగా వచ్చిన బాస్ భార్య అన్నారు. "ఆ సంగతి ఏదో చూడు" అప్పలరాజు హడావిడిగా వెళ్ళిపోయాడు.

"అదృష్టం అంటే అప్పలరాజుదేరా" మూర్తి సహోద్యోగి అన్నాడు. "మొన్ననే చేరాడు ఉద్యోగములో. అయినా అసిస్టెంటు మేనేజరు అయిపోయాడు"

"అదృష్టం ఏమిటి నాబొంద" మరొకడు అన్నాడు. "బాస్‌ని మచ్చిక చేసుకున్నాడు" అంతే.

"ఈ యిల్లు అతని చలవే కదా?"

"అప్పలరాజు సొంత యిల్లు కట్టుకున్నప్పుడు కూడా యింత కష్టపడలేదట"

"కష్టపడటం ఒక్కటేనేమిటి, ఏభైవేలు దాకా సర్దాడట. వాడికేమిటి - బాగా వున్నవాడు?"

"పాపం మూర్తిగారు ! అందరికన్నా సీనియర్ కష్టపడి పనిచేస్తాడు కూడాను, అయినా ఏమిటి ప్రయోజనమ ?"

మూర్తికి అక్కడ నిలబడాలని అనిపించలేదు. రెండు అడుగుల ముందుకు వేసాడు. అటూయిటూ తిరిగేడు.

"మీరేనా మూర్తిగారంటే?" ఎవరో భుజం తట్టి అడిగారు. "మీ గురించి లోన అడుగుతున్నారండీ"

"ఎవరు? ఎవరు అడుగుతున్నారు?" అతని హృదయము ఆనందంతో ఉప్పొంగిపోయింది. బహుశః తను వెతుకుతున్న అతడు వచ్చి వుండవచ్చేమో!

ఎలా వుంటాడండీ అతను" మూర్తి అడిగాడు.

"పండు ముసలివాడు బంగారము పోతపోసినట్లు ఉంది అతని ఒళ్ళు, ప్రశాంతముగా, తెల్లగా వున్నాయి కళ్ళు, అదిగో అక్కడ ఆ గదిలోనే వున్నాడు. మూర్తి వచ్చాడా అని అడుగుతున్నాడు"

లోనికి పరుగెత్తాడు మూర్తి. సంవత్సరాల తరబడి వెతుకుతున్న అతన్ని కలుసుకోబోతున్నాడనే ఆనందముతో అడుగులు చురుకుగా సాగేయి. ఆనందముతో వెలిగిన అతని మోము కొత్తయింటి గుమ్మం దగ్గర అమర్చిన వేయి ఓల్టుల నియోన్ బల్బుకన్నా కాంతిని వెదజల్లింది.

గానీ, ఆ పండు ముసలివాడు ఆ గదిలో కనబడలేదు. ఆ గదిలో నుంచి మరొక గదిలోకి వెళ్ళాడు మూర్తి. అతను అక్కడ కూడ కనబడలేదు. ఆ గదిలో నుంచి మరో గదిలోకి, అక్కడ నుంచి మరో గదిలోకి వెళ్ళి వెతికాడు. ఆయన ఎక్కడ కనబడలేదు. వెతికి వెతికి అలసిపోయిన మూర్తి బయటకు వచ్చాడు.

"బాగుందండీ భోజనం" ఎదురుగా నిలబడి ఉంది కమల, హాయిగా తృప్తిగా తాంబూలం నములుతూ, "యింక వెళదామా?"

అతను కమలను అనుసరించాడు.

మూర్తి ఒళ్ళు కాలిపోతుంది. అతని శ్వాసగతి కూడా ఎక్కువగా వుంది. కమల ఆ విషయం గమనించింది.

"మంచంమీద కూర్చోండీ" ఇంటి తలుపు తియ్యగానే అంది ఆమె. "నేను మాత్ర తెస్తాను" మంచము మీద కూలబడ్డాడు మూర్తి.

సంవత్సరాల తరబడి వెతుకుతున్న వ్యక్తి దగ్గరకు వచ్చినప్పుడు కలుసుకోలేక పోయినందుకు కృంగిపోయాడు మూర్తి. జుత్తు పీక్కున్నాడు. పిచ్చెక్కుతున్నట్లు తోచింది

అతనికి.

హఠాత్తుగా.... ఎదురుగా వున్న అద్దంలో తన మొహము కనిపించింది మూర్తికి. కళ్ళు లోతుకుపోయి నీరసంగా కనబడిన తన మొహము చూస్తూ వుంటే అతనికి అసహ్యము వేసింది. అయినా అలా అద్దంవైపు చూస్తూ వుండిపోయాడు. అప్పుడు అతనికి కనబడింది అతని మోము కాదు ఎవరి ఆధారము లేక నెట్టుకొచ్చిన అతని జీవితం!

"మాత్ర అక్కరలేదే కమల, అక్కరలేదు" గట్టిగా అరిచాడు అతడు. "నాకే జబ్బు లేదు"

కంగారుగా పరుగెత్తుకొని వచ్చింది కమల.

"నాకే జబ్బూలేదు. ఇంకరాదు కూడా" హాయిగా నవ్వాడు మూర్తి" ఎందుకంటే నాకు అతను కనబడ్డాడు. ఇన్ని సంవత్సరాలుగా నేను వెతికే అతడు కనబ్డాడు.

కంగారుగా అటూ, యిటూ చూసింది కమల. ఆమెకు ఎవరూ కనబడలేదు.

"చూడు ఇక్కడే వున్నాడు అతడు" అద్దంలో చూపిస్తూ అన్నాడు మూర్తి. "నేను వెతికే అతడు యిక్కడ వున్నాడు"

మూర్తికి పిచ్చెక్కిందేమోనని కంగారుపడింది, కమల.

"ఇదిగో చూడు, ఇక్కడ ఈ అద్దంలో చూడు" మూర్తి మళ్ళీ అన్నాడు. ఆమెకు అద్దంలో భర్త మొహము తప్ప మరేమీ కనపడలేదు.

"ఏమైదండీ మీకు?" ఆమె ఏడ్చేసింది.

"నేను యింతవరకూ వెతికేది నన్నే". అతను హాయిగా నవ్వుతూ కిటికీవైపు నడుస్తూ అన్నాడు "అది నాకు యిప్పుడర్థమయింది"

ఆశ్చర్యముతో అలా ఉండిపోయింది కమల.

ఎదురుగా వున్న కిటికీలో నుంచి చూసింది ఆమె. అలలు సద్దుమణిగిన సముద్రము చాలా ప్రశాంతముగా కనబడినది ఆమెకు.

(మూసీ మాసపత్రిక ఏప్రిల్, 99)